సాక్షి చిత్తూరు

మంగళవారం ၊ 1 ၊ అక్టోబర్ ၊ 2024



ప్రజల వినతులకు ప్రాధాన్యం

వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

- 8లో



పరిపూర్ణం..పవిత్రోత్సవం

అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ముగిశాయి.

- 8లో



బాలిక అదృశ్యం.. గాలింపు ముమ్మరం

పుంగనూరు పట్టణంలో ఆదివారం రాత్రి ఓ బాలిక అదృశ్యమైంది. పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 1,339 చౌకదుకాణాల పరిధిలోని 5,31,019 కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర అందించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాకు 15వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 3వేల మెట్రిక్ టన్నుల చక్కెర వచ్చినట్లు వివరించారు.

తెలంగాణ డీఎస్సీలో పలమనేరు విద్యార్థినికి ఫస్ట్ ర్యాంక్



తహసీనా

పలమనేరు : తెలంగాణ విద్యాశాఖ నిర్వహించిన టీజీ డీఎస్సీ–24 ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఇందులో పలమనేరుకు చెందిన తహసీనా అనే విద్యార్థిని 75.57 శాతం మార్కులతో ఉర్దూ మీడియంలో తొలి ర్యాంకు సాధించింది. విద్యార్థిని తండ్రి సుందర్ పలమనేరులో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డీఎస్సీ టాపర్‌గా నిలిచిన విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని భవిత కేంద్రాలలో ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భవిత కేంద్రాలలో 5 ఫిజియోథెరపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఒక్క క్యాంపునకు హాజరైతే రోజుకు రూ.1,050 చెల్లించబడుతుందని వెల్లడించారు. ఈ మేరకు ఆసక్తిగల వారు దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ లోపు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ప్రసాద్



ప్రసాద్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా చిత్తూరుకు చెందిన ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ ఎన్నికయ్యారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో చెస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. యువతకు చదరంగంపై మక్కువ పెంచేందుకు క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఏపీ చెస్ అసోసియేషన్ సభ్యులు గజేంద్ర, జయకుమార్, వెంకటస్వామి, చిన్ని ఘనంగా సత్కరించారు.

మృత్యుఘాట్



మొగిలి ఘాట్‌లో ముందు మార్గం కనిపించని ప్రమాదక మలుపు ఇదే

సువిశాలమైన చెన్నై– బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలిఘాట్ ప్రమాదాలకు నిలయంగా మారింది. మలుపుల రూపంలో మృత్యువు పొంచి ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా వాహన నడిపినా యమపురికి సాగనంపుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రాణాలను హరించింది. మరింత మందిని క్షతగాత్రులుగా మార్చేసింది. చివరకు మొగిలిఘాట్ పేరు వింటేనే జనం వణికిపోయే పరిస్థితి వచ్చేసింది. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు సైతం ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాలను సరి చేయాలని పేర్కొంది. ఈ మేరకు నిపుణుల సలహాలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు స్పష్టం చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించింది.

- ప్రమాదాలకు నిలయంగా మొగిలిఘాట్
- ప్రాణాలు హరిస్తున్న భూతాలబండ.. దొరచెరువు మలుపు
- యాక్సిడెంట్ జోన్‌పై అవగాహన లేని డ్రైవర్లతోనే ముప్పు
- జాగ్రత్తలపై ఎన్‌హెచ్ అధికారులకు సూచనలిస్తున్న ఎనలిస్ట్‌లు

పలమనేరు : చెన్నై– బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్ వద్ద దశాబ్దాలుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తరచూ మైనర్ యాక్సిడెంట్‌లు, అప్పుడప్పుడు మేజర్ ప్రమాదాలు స్థానికులను ఉలికిపాటుకు గురిచేస్తుంటాయి. గత పదేళ్లలో ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 26 మంది మృతి చెందారు. అయితే ఈ ఏడాది ఒక్క ఆగస్టులోనే మొగిలిఘాట్‌లో మూడు మేజర్ ప్రమాదాలు జరిగాయి. పది మంది ప్రాణాలు తీసేశాయి. దీంతో మొగిలి ఘాట్ అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఘాట్‌లో ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు సైతం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందంటే ఇక్కడి ప్రమాదాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



వాహనాలు డివైడర్ దాటే ప్రమాదకర ప్రాంతం ఇదే..

మానవ తప్పిదాలూ కారణమే...



ఇటీవలే ప్రమాదానికి గురైన రెండు లారీలు (ఫైల్)

బెంగళూరు నుంచి వంద కిలోమీటర్ల వేగంతో వచ్చే వాహనాలు అదే స్పీడ్‌తో ఘాట్‌లోనూ వెళుతున్నాయి. ఈ ప్రాంతంలో జరిగిన 90 శాతం రోడ్డు ప్రమాదాల్లో ఘాట్‌పై అవగాహన లేక డ్రైవర్ల తప్పిదాలతో జరిగినవే ఎక్కువ. దూర ప్రాంతాలనుంచి డ్రైవింగ్ చేస్తూ వచ్చే డ్రైవర్లకు అలసట, నిద్రలోకి జారుకోవడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, అనుభవం లేకపోవడం కూడా కారణమే. దీంతో పాటు డ్రైవర్లు కొన్ని సందర్భాల్లో భ్రాంతికి గురై కొన్ని క్షణాలపాటు మెదడు పనిచేయకపోవడం కూడా కారణమనే యాక్సిడెంట్ ఎనలిస్టులు చెబుతున్నారు. దీన్నే మోటరిస్ట్ వెస్టిబులర్ డిస్‌ఓరియంటేషన్ సింట్రోమ్ అంటారని వెల్లడిస్తున్నా.

నివారణకు మార్గాలిలా..

సుప్రీం కోర్టు ఆదేశాలతో ఇటీవలే రోడ్డు ప్రమాదాల నివారణ ఎనలిస్ట్ బాలాజీ మొగిలి ఘాట్‌ను పరిశీలించారు. ఈ మేరకు ఎన్‌హెచ్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డివైడర్‌ల వద్ద మూడు అడుగుల పొడవైన పోల్స్ నాటించడం, రంబుల్ స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం, రోడ్డుకిరువైపులా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఘాట్‌లోకి రాగానే వాహన వేగాన్ని పూర్తిగా తగ్గించేలా స్లోజోన్‌గా మార్చాలని కోరారు. ఘాట్‌కు ముందు నుంచే ఈ మార్గం డెడ్లీ యాక్సిడెంట్ జోన్ అంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని దీంతో డ్రైవర్లు అప్రమత్తమవుతారని వివరించారు. ఘాట్‌లో ఎక్కువగా సోలార్ లైట్లు, మలుపుల వద్ద భారీ లైటింగ్, రేడియం రిఫ్లెక్టెడ్ స్టిక్కరింగ్ వేయించాలని తెలిపారు. ఈ మేరకు నివేదికను సైతం అందజేశారు. ప్రధానంగా ఇంటర్‌సెప్టార్ వెహికల్ ద్వారా వాహనాల వేగం గుర్తించాలని పేర్కొన్నారు.



మొగిలి ఘాట్‌లో ఇంటర్‌సెప్టార్ ద్వారా వాహనాల వేగం గుర్తిస్తున్న సీఐ శ్రీనివాసులు

నిర్మాణంలో లోపాలు!

మొగిలి ఘాట్‌లో ప్రమాదాలకు రోడ్డు నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాలే అసలు కారణంగా పలువురు నిపుణులు వెల్లడిస్తున్నారు. అలాగే కొన్ని మలుపులు కూడా మృత్యుపాశాలను విసురుతున్నాయని చెబుతున్నారు. ఈ రోడ్డు విస్తరణకు ముందు గాంధీనగర్ వద్ద మలుపులో ఎక్కువగా ప్రమాదాలు జరిగేవి. ఫోర్‌లేన్ రోడ్డు నిర్మించిన తర్వాత దొరచెరువు మలుపును సరిచేయలేదు. ఇక్కడ రోడ్డు పల్లంలో ఉంటుంది. దీంతో వేగంగా వచ్చే వాహనాలను ఈ మలుపులో కంట్రోల్ చేయడం డ్రైవర్లకు కష్టంగా మారుతోంది. వెహికల్‌ను హఠాత్తుగా టర్న్ చేయడంలో విఫలమై డివైడర్‌ను దాటేసి ఎదుటి వాహనాలను ఢీకొట్టేస్తున్నారు. దీనికి తోడు ఘాట్ రోడ్డు మధ్య నిర్మించిన డివైడర్ ఎత్తు చాలా తక్కువగా ఉంది. ఫలితంగా డౌన్‌లో వేగంగా వచ్చే వాహనాలు ఉన్నట్టుండి డివైడర్‌పైనుంచి పక్కనున్న రోడ్డులోకి వెళ్లిపోతున్నాయి. అలాగే రోడ్డు అన్ లెవలింగ్ కారణంగా వాహనాలకు గ్రిప్ దొరక్క తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కంటైనర్లు, లాంగ్ క్యారియర్, గూడ్స్ లారీలే ఎక్కువగా అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. డీజిల్ ఆదా కోసం భారీ వాహనాలను డౌన్‌లో న్యూట్రల్ గేర్‌లో నడపడం కూడా ప్రమాదకరంగా పరిణమిస్తోంది.

సూచనలు పాటించాలి



దేశంలోని ప్రమాదకర రోడ్లు, ప్రాంతాలు, ఘాట్‌లు, మలుపులను పరిశీలించాం. అందులో భాగంగానే మొగిలిఘాట్‌ను కూడా సందర్శించాం. ప్రమాదాల నివారణకు సంబంధించి ఎన్‌హెచ్ అధికారులకు పలు సూచనలు చేశాం. ఆ మేరకు నివేదిక సైతం అందించాం. అందులో పేర్కొన్న సూచనలను ఎన్‌హెచ్ అధికారులు పాటిస్తే 80 శాతం ప్రమాదాలు తగ్గుతాయి.

– బాలాజీ, యాక్సిడెంట్ కాజ్ ఎనలిస్ట్

అవగాహన కల్పిస్తున్నాం



ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వాహనాలు నడపడంపై డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. మొగిలిఘాట్‌పై బయటి ప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లకు అవగాహన ఉండదు. అందుకే ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలే అధిక సంఖ్యలో ఇక్కడ ప్రమాదానికి గురవుతుంటాయి. డ్రైవర్లు తప్పనిసరిగా తగు విశ్రాంతి తీసుకుంటూ ఉండాలి. అప్పుడే అప్రమత్తంగా డ్రైవింగ్ చేయగలరు. అధికారులు కూడా ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలి.

– జీలు, లారీ ట్రాన్స్‌పోర్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పలమనేరు

పకడ్బందీగా ఉపాధి కల్పన



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక వనరులను సద్వినియోగం గ్రామీణ యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు అందించాలన్నారు. ఈ దిశగా జిల్లాను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును ఛత్తీస్‌ఘడ్ బృందంతో అధ్యయనం చేయించేందుకు నిర్ణయించిందన్నారు. జిల్లాలో పాడి పరిశ్రమ, ఉద్యానవన, వ్యవసాయశాఖ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖల సేవలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందిస్తుందని వివరించారు. అనంతరం పలుశాఖల అధికారులు వివరాలు తెలిపారు. వరి, వేరుశనగ, చెరుకు, మామిడి సాగు జిల్లాలో ఎక్కువగా ఉందన్నారు. కుప్పంలో పండ్లు కూరగాయల సాగు ఎక్కువగా ఉందని చెప్పారు. పలమనేరు, వి.కోటలో మల్బరీ సాగు సాగుతోందన్నారు. నగరిలో చేనేత పరిశ్రమ పురోగతి సాధిస్తోందని తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు పాల్గొన్నారు.

తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమావేశం

జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమావేశమయ్యారు. మొత్తం 588 ఎస్టీ గ్రామాల్లో సర్టిఫికెట్ల మంజూరు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆధార్‌కార్డులు లేనివారిని గుర్తించి నవంబర్ 15వ తేదీలోపు నమోదు చేయించాలని ఆదేశించారు.

ఎక్సైజ్ అధికారుల బదిలీ



చిత్తూరు అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీహరి

చిత్తూరు అర్బన్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో పనిచేస్తున్న పలువురు సీఐలు, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం ఈ మేరకు కొందరు అధికారులు బాధ్యతలు కూడా చేపట్టారు. చిత్తూరు అర్బన్ సీఐగా శ్రీహరి, చిత్తూరు రూరల్‌కు ఎ.పురుషోత్తం, నగరికి పీటీ శ్రీనివాసరెడ్డి, కార్వేటినగరానికి డి.శిరీషాదేవి, పుంగనూరుకు కె.సురేష్‌రెడ్డి, పాలసముద్రానికి జి.భాగ్యలక్ష్మి, కుప్పం సీఐగా ఎ.నాగరాజు, పులిచెర్లకు ఎ.మాధవిస్వామి బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లాలో తిరుపతి అర్బన్‌కు ఎం.రామచంద్ర, తిరుపతి రూరల్ ఇ.నరసనాయుడు, చంద్రగిరికి కేవీఎస్.ఫణీంద్ర, పుత్తూరుకు బి.మురళీమోహన్, శ్రీకాళహస్తికి ఐ.లావణ్య, నాగలాపురానికి కె.దశరథరామిరెడ్డి, తిరుమలకు జి.తిరుమలయ్య నియమితులయ్యారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్‌కు బి.శ్యామ్‌ప్రసాద్, చిత్తూరు టాస్క్‌ఫోర్స్‌కు కె.మోహన్, చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పి.జవహర్‌బాబు, వైవీ పవన్‌కుమార్, కె.సత్యనారాయణ, చిత్తూరు మద్యం డిపోకు ఎం.రమణ, రేణిగుంటకు బి.ఇంద్రాణి, నరహరిపేట చెక్‌పోస్టుకు పి.కృష్ణకిషోర్, వి.కోటకు కె.కృష్ణమోహన్, క్యాటిల్‌ఫామ్‌కు వై.విజయ్‌కుమార్, పి.నాగరాజు, మొబైల్ బోర్డర్ పెట్రోలింగ్ నిమిత్తం పలమనేరుకు వై.సతీష్‌ను బదిలీ చేశారు.

ఎస్‌ఐలు ఇలా..

ఎస్‌ఐల బదిలీల్లో వై.హరికృష్ణ, ఎ.మహేష్ నరసింహ, బి.జయశంకర్‌లను తిరుపతి అర్బన్కు, వి.కవీశ్వరనాయుడు, బి.అంజలి ప్రసన్నలను తిరుపతి రూరల్‌కు, కె.గిరి, ఎం.సుధాకర్‌రావును చంద్రగిరికి, ఎస్.అంజాద్‌బాషా, పి.శివప్రసాద్‌ను పుత్తూరుకు, కె.భాస్కర్, ఎం.నిరంజన్‌రెడ్డిని శ్రీకాళహస్తి, కె.బాబు, టి.అన్వేష్‌ను నాగలాపురం, సి.నరేష్‌బాబును తిరుమలకు, ఎస్.స్వామినాథన్‌ను తిరుపతి ఎస్టీఎఫ్, జి.రామకృష్ణశాస్త్రి తిరుపతి మద్యం డిపోకు, ఆర్.పృథ్వీరాజ్, బి.మోహన్‌కృష్ణను చిత్తూరు అర్బన్, పి.శరవణతేజ్, ఎం.మోసెస్‌ను కార్వేటినగరం, ఏవీ రమణరాజు, ఎ.రామ్మూర్తిని చిత్తూరు రూరల్, పి.వెంకటేశులును నగరి, ఎం.వేణుగోపాల్‌రెడ్డిని పుంగనూరు, పి.భానుప్రకాష్‌ను పలమనేరు, టి.మహేంద్ర, జి.మోహన్‌బాబును కుప్పం, వి.సంధ్యను పులిచెర్ల, బి.వెంకటేశులును చిత్తూరు మద్యం డిపో, జి.అశోక్‌కుమార్‌ను చిత్తూరు ఈఎస్‌టీఎఫ్, బి.రామదాసు క్యాటిల్‌ఫామ్ చెక్‌పోస్టు, పి.పృథ్వి చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంటుకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దిగుపడి



వేరుశనగ ఒబ్బిడి చేస్తున్న కూలీలు

జిల్లాలో వేరుశనగ ఒబ్బిడి ముమ్మరంగా సాగుతోంది. దిగుబడి పడిపోవడంతో రైతాంగం ఆందోళనలో ఉంది. మొక్కలకు సరిపడా కాయలు లేకపోవడంతో దిగాలు చెందుతోంది. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాలు పంటను దెబ్బతీసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడుతోంది. ఆదుకోవాల్సిన సమయంలో అలసత్వం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తోంది.

- జిల్లాలో చివరి దశకు చేరిన వేరుశనగ ఒబ్బిడి
- మొక్కలకు అరకొరగా కాయలు
- పంటను దెబ్బతీసిన వైపరీత్యాలు
- పరిహారం చెల్లించాలంటున్న రైతులు
- గణాంకాల కోసం గారడీ చేస్తున్న అధికారులు



ఎండిపోయిన పంటను చూపిస్తున్న రైతు

కాణిపాకం : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వేరుశనగను కేవలం 13,044 హెక్టార్లల్లో మాత్రమే సాగు చేశారు. ఇందులో 11వేల హెక్టార్ల వరకు పంట ఎండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు జోరుగా వేరుశనగ ఒబ్బిడి పనులు చేపట్టారు. ప్రస్తుతం పంట ఒబ్బిడి చివరి దశకు చేరుకుంటోంది. ఇప్పటికే దాదాపు 70శాతం మంది రైతులు కాయలను బ్యాగుల్లోకి తెచ్చుకున్నారు. అయితే ఎకరాకు 10 నుంచి 15 బ్యాగుల (ఒక్కో బ్యాగు 30 కేజీలు) దిగుబడి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఎకరాలకు ఒక్క బ్యాగు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో గత నాలుగేళ్ల వేరుశనగ సాగు వివరాలు

సంవత్సరం	సాధారణ విస్తీర్ణం హెక్టార్లలో	సాగు విస్తీర్ణం హెక్టార్లలో	పంట దిగుబడి మెట్రిక్ టన్నుల్లో
2021	53,026	50,488	75,118
2022	52,125	34,308	53,410
2023	51266	15,170	14,427
2024	43174	13,044	5వేల నుంచి 6 వేలు

లెక్కల కోసం ప్రయోగాలు

జిల్లాలో వేరుశనగ రైతులు నష్టకష్టాలు పడుతుంటే, అధికారులు మాత్రం గణాంకాల కోసం పాకులాడుతున్నారు. జిల్లా నుంచి అధికంగా వేరుశనగ దిగుబడి వచ్చిందని చెప్పుకునేందుకు యత్నిస్తున్నారు. ఇందుకోసం పంట ప్రయోగాలను వినియోగించుకుంటున్నారు. ఎక్కడైనా వేరుశనగ పంట బాగుంటే అక్కడే ప్రయోగాలను చేపట్టి దిగుబడికి అదే కొలమానంగా లెక్కలు నమోదు చేస్తున్నారు. వాస్తవాలను ప్రభుత్వానికి సైతం తెలియనీయకుండా తప్పుదారి పట్టిస్తున్నారు. అధికారుల వ్యవహారశైలిపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. తమ ఇక్కట్లను తెలియజేయకుండా, తప్పుడు నివేదికలు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి

వేరుశనగ పంటకు పెట్టుబడి ఖర్చులు అమాంతంగా పెరిగిపోయాయి. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురిస్తే..ఎకరా భూమిలో రాళ్లు..రప్పలు ఏరివేతకు ముగ్గురు కూలీలు అవసరమతారు. ఇందుకు ఖర్చు రూ.2వేలు. అలాగే రెండు సార్లు దుక్కులకు రూ. 2వేలు, విత్తనం కొనుగోలుకు రెండు బ్యాగులకు గాను రూ. 3200, ఎరువులు, రవాణా ఖర్చులతో కలిసి సుమారు రూ.10వేలు, రెండు సార్లు కలుపు తీసేందుకు రూ. 5వేలు, ఒబ్బిడి చేసేందుకు రూ.3 వేల నుంచి 5 వేల వర కు ఖర్చు అవుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లేని 'భరోసా'

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా రైతులకు సాగుకు ముందే పెట్టుబడి సాయంగా రైతు భరోసా నగదు అందించేవారు. ఈ సొమ్ము అన్నదాతలకు అండగా ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరిట రూ.20వేలు అందిస్తామని నమ్మించి రైతుల గొంతు కోసేసింది. సర్కారు సాయం చేస్తుందిలే అని సాగుకు సన్నద్ధమైన వారిని దగా చేసింది. అప్పుల పాలు చేసేసింది. చివరకు పంట దిగుబడి కూడా సక్రమంగా రాకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. అలాగే ఈ–క్రాప్ నమోదును సైతం చేపట్టకపోవడంతో అన్నదాతలు బీమా సౌకర్యాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చింది.

మూడు కాయలు కూడా లేవు



ఈసారి ఎకరాలో వేరుశనగ పంట సాగు చేశా. ఖర్చుల విషయం పక్కన పెడితే మొక్కకు మూడు కాయలు కూడా లేవు. కొన్ని కాయ ల్లో సక్రమంగా పప్పు లేదు. ఊడ లు దిగే సమయానికి చినుకు కూడా పడలేదు. దీంతో పంట ఎండిపోయింది. అడపాదడపా బోరు ద్వారా నీరందించి...పంట పచ్చగా ఉండేలా చూసుకున్నా. నాకు తీగలు మాత్రమే మిగిలాయి. పెట్టుబడికి తగ్గట్టు లాభం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– దామోదర్‌నాయుడు, చింతలగుంట, చిత్తూరు మండలం

మూట వచ్చేది కూడా కష్టమే



ఎకరాలో వేరుశనగ పంట వేస్తే 10 నుంచి 15 మూటల దిగుబడి రావాలి. కానీ, ప్రస్తుతం మూట కాయలు వచ్చేది కూడా కష్టమే. దీనికి తోడు పందులు వచ్చి పంట మొత్తం నాశన చేశాయి. ఎండల వల్ల మరో పక్క మొక్కలు ఎదగలేదు. చాలా వరకు ఎండిపోయాయి. గట్టిగా లాగితే కాయలు నేలపాలవుతున్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు స్పందించి పరిహారం ఇప్పించేలా చర్యలు చేపట్టాలి.

– అన్నుల్, తాళంబేడు, చిత్తూరు మండలం





క్లుప్తంగా

మళ్లీ రిక్వెస్ట్ బదిలీలకు శ్రీకారం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లకు సంబంధించి రిక్వెస్ట్ బదిలీల ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిబంధనల ప్రకారం బ్యాన్ ఉన్న సమయంలో ఎలాంటి బదిలీలు నిర్వహించడానికి వీల్లేదు. అయితే రిక్వెస్ట్ బదిలీల పేరుతో పలుకుబడి ఉన్న టీచర్లను కోరుకున్న చోటుకు బదిలీ చేసే కసరత్తును ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు ఆదివారమే జిల్లాలోని కొందరు టీచర్ల పేర్ల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ పంపింది. జాబితాలో పేర్కొన్న టీచర్ల వివరాలను రిమార్కుల రూపంలో పంపించాలని డీఈఓను ఆదేశించింది.

5లోపు నామినల్ రోల్స్

చిత్తూరు కలెక్టరేట్ : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్స్ (ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష ప్రింటెడ్ నామినల్‌రోల్స్‌ను ఈ నెల 5వ తేదీ లోపు అందజేయాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. సోమవారం ఈ మేరకు డీఈఓ మాట్లాడుతూ స్టూడెంట్స్ ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఫీజు చలానాలను సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు గడువు తేదీలోపు అందించాలని సూచించారు. అలసత్వం వహిస్తే బాధ్యత సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలదేనని స్పష్టం చేశారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
Residential Teachers for Mathematics, P.E.T and Drivers to work in a reputed School.
8688888802

అర్జెంటుగా కావలెను
మా రెస్టారెంట్ నందు పనిచేయుటకు
కిచెన్ అసిస్టెంట్స్
స్టివార్డ్స్ కావలెను
కనీసం 6 నెలలు నుంచి 1 సంవత్సరకాలం అనుభవంగలవారు కావలెను.
సంప్ర: 8341102247, 83411 02246
Email: reception@lakevalleyresort.in
LAKE VALLEY RESORT & SPA
Bhakrapeta Highway (NH-71) Tirupati (District)

రుచికరంగా వంటకాలు తయారు చేయడంలో ఆరడిగుంట వాసులు ప్రసిద్ధికెక్కారు. వేలాదిమందికి సైతం సునాయాసంగా శాఖాహార భోజనాలు అందించడంలో సిద్ధహస్తులుగా పేరుపొందారు. వంశపారంపర్యంగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా కర్ణాటక.. తమిళనాడులోని పలు ప్రాంతాలకు సైతం బృందాలుగా వెళ్లి వండి వారుస్తుంటారు. సమష్టిగా పనిచేస్తూ.. నాణ్యమైన ఆహారం అందిస్తుంటారు. నలభీములను తలపిస్తూ అందరితో ప్రశంసలందుకుంటున్నారు.


వంటల తయారీలో ఆరడిగుంట వాసులు (ఫైల్)

ఆరడిగుంట ఘుమఘుమలు!

- నలభీములను తలపించే వంటగాళ్లు
- వంశపారంపర్య వృత్తిగా వంటలు
- పొరుగు రాష్ట్రాల నుంచి కూడా బుకింగ్‌లు

పుంగనూరు : మండలంలోని ఆరడిగుంట గ్రామంలో సుమారు 120 కుటుంబాలకు చెందిన లింగాయితులు నివసిస్తున్నారు. పూర్వం జమీందారులకు సైతం వీరే వంట చేసిపెట్టేవారు. రుచికరమైన వంటలు వండి పెట్టి జమీందారుల నుంచి అనేక ప్రశంసలు పొందారు. అప్పట్లో రుద్రప్ప, చెంగయ్య, నాగప్ప, ఆవులన్న, మాధవరావు, సదాశివయ్య చేతివంటలకు జనం ఎగబడేవారు. ప్రస్తుతం ఆ గ్రామంలో కేవీ రెడ్డెప్ప, మంజునాథ, మల్లికార్జున, ప్రభాకర, జె.మల్లికార్జున తదితరులు వంట కాంట్రాక్టర్లుగా ఉన్నారు. వంటలు చేయడంలో వీరు ప్రావీణ్యం సంపాదించారు. గ్రామంలో ఇంటికి ఒకరిద్దరు చొప్పున వంట పనులకు వెళుతుంటారు. ఖాళీ సమయాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. శుభకార్యాలు, సమావేశాలకు విందు భోజనాలు తయారు చేయాలంటే ఆరడిగుంట వంటగాళ్లకే ప్రాధాన్యమిస్తుంటారు. గ్రామంలో ప్రస్తుతం బృందాలుగా ఏర్పడిన వంటగాళ్లు కర్ణాటకలోని చింతామణి, హోసకోట, కోలారు, కెజిఎఫ్, బంగారుపేట, శ్రీనివాసపురం, మాండ్య, బెంగళూరు, తమిళనాడులోని తిరుపత్తూరు, వానంబాడి, ఆంబూరు, కృష్ణగిరి, సేలం, ఆంధ్రప్రదేశ్‌లోని కదిరి, అనంతపురం, తిరుపతి, నెల్లూరు , చిత్తూరు తదితర జిల్లాలకు వెళ్లి వంటలు చేస్తున్నారు.

ఈ వంటకాలు ప్రత్యేకం

ప్రతి ఒక్కరు ఎంతో ఇష్టంగా తినే పూర్ణం పోళీలు (బొబ్బట్లు), కొబ్బరి పోళీలు, బిసిబేళాబాత్, కిచిడీ, పొంగల్, దిల్ పసంద్, కొబ్బరి బర్ఫీ, సుఖీలు, నెయ్యి రైస్, పుదీనా రైస్, విజిటబుల్ పులావ్, గోబీ మంచూరియా, పానీపూరి, మసాల పూరి, చౌచౌ బాత్, సెట్ దోసె, మసాలా దోసె, ఉల్లి ఉండలు, మిరపకాయ బజ్జీ, ఉర్లగడ్డ బజ్జీతో పాటు కర్ణాటకలో అత్యంత ప్రీతికరంగా తినే పేణి, చంపాకలి, రసమల్లై, వాంగీబాత్, శ్యాండ్‌విచ్, రాయల్, గోడంబీ బర్ఫీ, పితుకుపప్పు పాయసం, సేమియా, పెసరపప్పు, గోడంబీ పకోడీ, ఆనియన్ పకోడీ, జీడిపప్పు పకోడీ, ఇలా రకరకాల రుచికరమైన వంటలను ప్రత్యేకంగా చేస్తుంటారు.

శాఖహారం మాత్రమే..

ఆరడిగుంట వంటగాళ్లు శాఖహార వంటలు మాత్రమే తయారు చేస్తారు. వంద మంది నుంచి వేల మందికైనా మూడు పూటలా వంటలు చేసి వడ్డించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. వంటలు చేసేందుకు రవాణా ఖర్చులు, ఇతరత్రా ఖర్చులతో కలసి కాంట్రాక్ట్ తీసుకుంటారు. అలాగే వంటకు సంబంధించి పాత్రలు సైతం సమకూర్చుకుని తమ బృందంతో బుక్ చేసుకున్న వారు చెప్పిన ప్రాంతానికి వెళ్లిపోతారు. మూడునెలలు, ఆరు నెలలు ముందుగా వీరిని బుక్ చేసుకుని అడ్వాన్సు చెల్లిస్తే కానీ ఆరడిగుంట వాసులు దొరకరు.

రాజకీయాల దిశగా..

ఏళ్ల తరబడి వంటలకే పరిమితమైన ఆరడిగుంట లింగాయితులను వైఎస్సార్‌సీపీ గుర్తించింది. రాజకీయంగా ప్రోత్సహించి గౌరవించింది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆరడిగుంట సర్పంచ్‌గా శంకరప్ప, ఎంపీటీసీ సభ్యుడిగా నంజుండప్ప, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శోభ, చిత్తూరు జిల్లా రైతు సలహా మండలి కమిటీ మెంబర్‌గా కేవీ రెడ్డెప్పకు అవకాశం కల్పించింది.

ఎంతో ఆనందం



సుమారు 30 ఏళ్లుగా ఈ వంట వృత్తిలోనే కొనసాగుతున్నా. కాంట్రాక్ట్ విధానంలో ఒక పూటకు ఐదువేల మందికి కూడా వివిధ రకాల వంటలు తయారు చేసి పెడతాం. ఎక్కడా వివాదాలకు తావు లేకుండా పని పూర్తి చేస్తాం. ఎన్నికల సమయంలో కూడా మేం చేసిన వంటలను తిని అధికారులు, సిబ్బంది ఎంతో ప్రశంసించారు.
– కేవీ రెడ్డెప్ప , వంటల కాంట్రాక్టర్

ప్రాంతాలకు తగ్గట్టుగా..



ఒక్కో ప్రాంతంలో ఒకొక్క విధంగా వంట రుచులు కోరుతారు. వారికి తగ్గట్టుగా వంటలు చేసి ఇవ్వడం మా ప్రత్యేకత. కార్యాలకు ముందుగానే ఆర్డర్లు తీసుకుని , అందుకు అనుగుణంగా వంటల మనుషులు, సరుకులు సిద్ధం చేసుకుంటారు. పని ఇచ్చిన వారికి మాట రాకుండా చిత్తశుద్ధితో వంటలు చేసి వడ్డిస్తుంటాం.
– శంకరప్ప, సర్పంచ్, (వంట కాంట్రాక్టర్)

రుణపడి ఉంటాం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలిసారిగా మా కులస్తులకు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, డైరెక్టర్ పదవులు కేటాయించారు. వంటలకే పరిమితమైన మా సామాజిక వర్గాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంతగానో ప్రోత్సహించారు.రాజకీయ పదవులు కట్టబెట్టి మాకు గుర్తింపు ఇచ్చారు. మాకు సహకరించిందుకు రుణపడి ఉంటాం. – నంజుండప్ప, ఎంపీటీసీ సభ్యుడు, ఆరడిగుంట

బాలిక అదృశ్యం.. గాలింపు ముమ్మరం


అశ్వియ (ఫైల్)


వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ మణికంఠ

- 24 గంటలు గడుస్తున్న దొరకని ఆచూకీ
- కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పుంగనూరు : పట్టణంలో ఆదివారం రాత్రి ఏడేళ్ల బాలిక అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. వివరాలు.. స్థానిక యూబీ కాంపౌండ్‌కు చెందిన అజ్మతుల్లా, షమియా దంపతులకు అశ్వాక్ అనే కుమారుడు, అశ్వియ అనే కుమార్తె ఉన్నారు. అశ్వియ(7) రాత్రి 7 గంటల సమయంలో పక్కింట్లో ఆడుకునేందుకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల, బంధుమిత్రుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, బాలిక ఆచూకీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేపట్టారు.

నిశితంగా పరిశీలన

ఎస్పీ మణికంఠ ఆదేశాల మేరకు పుంగనూరు పోలీసులు చిత్తూరు, రాయచోటి నుంచి జాగిలాలను రప్పించారు. బాలిక ఇంటి నుంచి బయలుదేరిన పోలీసు జాగిలాలు ఉబేదుల్లా కాంపౌండులోని పలు వీధులలో పరుగెడుతూ చెంగలాపురం రోడ్డులోని ముళ్ల పొదల వద్ద ఆగిపోయాయి. దీంతో పోలీసులు , వందల సంఖ్యలో ముస్లిం యువకులు ముళ్లపొదల్లో గాలింపు చేపట్టారు. కానీ బాలిక ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రుల కాల్‌డేటా , పట్టణంలోని సీసీ కెమెరాల ఫుటేజీని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఎస్‌బీ డీఎస్పీ భాస్కర్, సీఐ శ్రీనివాసులు, క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు , ఏఆర్ డీఎస్పీ వెల్లీ ఆధ్వర్యంలో నిశితంగా పరిశీలన చేపట్టారు.

ప్రత్యేకంగా 11 బృందాలు

అశ్వియ ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేకంగా 11 పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన పట్టణంలోని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ బాలిక తండ్రి అజ్మతుల్లా ఆర్థిక లావాదేవీల కారణంగా కిడ్నాప్ జరిగిందా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరితగతిన ఈ కేసును పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

వ్యాపార లావాదేవీలే కారణమా..?

బాలిక తండ్రి వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వడ్డీ కోసం గొడవలు జరిగి ఎవరైనా బాలికను కిడ్నాప్ చేసి ఉంటారా? వ్యాపార లావాదేవీలే చిన్నారి కనపడకపోవడానికి కారణమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇది తెలిసిన వారి పనే..

కిడ్నాప్‌కు గురైన బాలిక హుషారుగా ఉండేదని, ఎవరైనా ముట్టుకుంటే కూడా సహించేది కాదని స్థానికులు చెబుతున్నారు. అమ్మాయిని కొత్తవారు తీసుకెళ్లే అవకాశం లేదని, ఇది కచ్చితంగా తెలిసిన వారి పనే అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పరిపూర్ణం..పవిత్రోత్సవం

పుత్తూరు: అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం సాయంత్రం పవిత్ర విసర్జనతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా వేకువనే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యుల బృందం యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిపించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఉత్సవర్లను విశేషంగా అభిషేకించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో స్వామి వారిని సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. మేళతాళాల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. దేవదేవేరులను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ BA, B.Com, B.Sc, BBA, BCA, B.Lis, MA, M.Com, M.Sc, MCA, MBA, , M.Lis, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT అక్టోబర్ 3వ తేది చివరి తేది: 9030030125.

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629

Real Estate

PLOTS FOR SALE
■ నేషనల్ హైవేకి అనుకొని IISER వెనుకవైపు ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే డైరెక్ట్ ఓనర్. 9502774175, 7416211984.

RENT
■ Scientific Warehouses with FCI Specification of 13,250 Sq.ft each 2 Warehouses total 26,500 Sq.ft is readily available for occupation for Rent at adjacent National Highway, Near Airport, PCR Warehousing Ltd.,D.No.3-147, Guravarajupalli, Tirupati-Srikalahasthi Road, Renigunta- 517520, Ctr, A.P, 98490 46567, Email: pcrayulu@gmail.com, Web:pcrgroup.in

TOLET
■ రామకృష్ణ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ నందు 2 BHK ఫ్లాట్ నెం.5-5-328C/308, 1200 చ.అ.లు గల ఫ్లాట్ బాడుగకు ఇవ్వబడును. కార్ పార్కింగ్ కలదు✆ 9885846182, 9959534715

WANTED
■ Wanted Villa. Wanted 4 or 5 Bed Room East/ North Facing Villa/ Individual House for Rent Purpose in Tirupati for a Business Family.✆ 90102 03671

Services

■ CLEANING. బాత్రూం క్లీనింగ్ & వాటర్ ట్యాంక్ క్లీనింగ్ & హౌస్ కీపింగ్ సర్వీసెస్ కోసం సంప్రదించండి సెల్: 9000312779, తిరుపతి.

Wanted

■ Shreya Collections రెడిమేడ్ షాపు తిరుపతి నందు పనిచేయుటకు సేల్స్ బాయ్స్ కావలెను. సంప్రదించండి: 9885298871, 8686826247.

■ తిరుచానూరు మెయిన్ రోడ్డు లాడ్జి నందు పనిచేయుటకు ఇంగ్లీషు మాట్లాడ కల్గిన రిసెప్షనిస్ట్, రూం బాయ్స్ కావలెను. సంప్ర: 9110550998.

■ Wanted Experienced Female Tele Caller work from home for Loans Sal + Incentives. Contact Cell: 90301 00111.

■ తిరుపతి, తిరుమలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. భోజనము, వసతి కలదు. సంప్రదించండి సెల్: 9100518607, 9515488473.

■ తిరుపతి హోమ్ కేర్ సర్వీసెస్, శ్రీమంతుల ఇళ్లలో పనిచేయుటకు పెద్దవారిని, పేషంట్లను చూసుకొనుటకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ:15000-18000 ✆8121555088, 8121555084

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

15 నుంచి ఇంటర్ త్రైమాసిక పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ త్రైమాసిక పరీక్షలు నిర్వహించాలని డీవీఈఓ సయ్యద్ మౌలా ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యా మండలి విడుదల చేసిందన్నారు. షెడ్యూల్ ప్రకారం సంబంధిత తేదీల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించా. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ప్రథమ సంవత్సరం, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని వివరించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


మృతి చెందిన మహబూబ్‌బాషా

పుంగనూరు : పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో జే టౌన్ వద్ద సోమవారం లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని రంగోనిమిట్టకు చెందిన మహబూబ్ బాషా(26) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహబూబ్‌బాషా మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పట్ట పగలు ఇంటి తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు.. కట్టమంచికి చెందిన మధుసూదన ప్రసాద్, ఇందుమతి దంపతులు ప్రభుత్వ ఉద్యోగులు. ఒకరు కొంగారెడ్డిపల్లెలోని ఐసీడీఎస్ శాఖలో, మరొకరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం ఇద్దరూ విధులకు బయలుదేరుతూ ఇంటికి తాళం వేసి వెళ్లారు. మధ్యాహ్నం భోజన విరామానికి ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా.. బీరువా, లాకర్లలో ఉంచిన దాదాపు 200 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొద్ది మొత్తం నగదు చోరీకి గురైంది. సీసీ ఫుటేజీలు పరిశీలించగా.. ఓ వ్యక్తి మొహానికి మాస్కు వేసుకుని చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. దాదాపు రూ.10 లక్షల విలువైన సొత్తును అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు విరాళం


ముఖ్యమంత్రికి చెక్ అందిస్తున్న తేజోమూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితులకు విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి రూ.10,00,116 విరాళం అందించారు. సోమవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడుకు చెక్ అందజేశారు. అలాగే కాణిపాకం వరసిద్దుని ఆలయంలో నిర్వహించిన వేలంలో దక్కించుకున్న లడ్డూ ప్రసాదాన్ని సైతం ముఖ్యమంత్రికి అందించినట్లు తేజోమూర్తి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఈడీ శైలజ, ఏఓ రాజగోపాల్, లైజన్ ఆఫీసర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర జిల్లా స్థాయి పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వర్ణాంధ్ర- 2047 జిల్లా స్థాయి పోటీలు నిర్వహించినట్లు డీవైఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎంఈఓలు రమేష్‌బాబు, మోహన్, ప్రసాద్, హసన్‌బాషా పర్యవేక్షించారు. వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి హిమశ్రీ (జెడ్పీ మంగళపల్లి), రెండవ బహుమతి పవిత్ర (జెడ్పీ ఏకాంబరకుప్పం), మదిహా సామన్ (జెడ్పీ కల్లూరు). వాగ్ధాటి పోటీల్లో మొదటి బహుమతి సాయిప్రియ (కేజీబీవీ రొంపిచెర్ల), అభినయ (జెడ్పీ టీఆర్ పురం), హేమ (జెడ్పీ మంగళపల్లి). డిబెట్స్‌లో మొదటి బహుమతి పునీత్ సాయి (జెడ్పీ మంగళపల్లి), సాధ్విశ్రీ (బంగారుపాళ్యం), ద్వితీయ బహుమతి రోహిత్ (జెడ్పీ ఎం.పైపల్లి), నిఖిత (ప్రభుత్వ పాఠశాల, ఐరాల), తృతీయ బహుమతి ఉమామహేశ్వరి (జెడ్పీ కార్వేటినగరం), హరిక (జెడ్పీ, కార్వేటినగరం) సాధించారు.

బొమ్మయ్యపల్లె సర్పంచ్ చెక్ పవర్ రద్దు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసినందుకు వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె సర్పంచ్ సి.గోవిందయ్య చెక్ పవర్ రద్దు చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దేవళంపేట వార్డు సభ్యుడు పయని ఫిర్యాదు మేరకు డీపీఓ ఇటీవల సంజాయిషీ నోటీసును సర్పంచ్‌కు జారీ చేసి, విచారణ చేపట్టారు. 2021–22, 2023–24 మధ్య పంచాయతీ నిధులు మొత్తం రూ.13.53 లక్షలు డ్రా చేయగా, అందులో రూ.2.91 లక్షలకు సరైన లెక్కలు లేవని తేలింది. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో సక్రమంగా లెక్కలు చూపనందున సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు.

చెక్‌బౌన్స్ కేసులో మహిళకు జైలు

చిత్తూరు అర్బన్: చెక్ బౌన్స్ కేసులో చిత్తూరుకు చెందిన శ్రీదేవి అనే మహిళకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ స్థానిక నాలుగో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. చిత్తూరు నగరంలోని సాయినగర్ కాలనీకు చెందిన చెరుకూరి పట్టాభినాయుడు నుంచి బీవీ రెడ్డి కాలనీకు చెందిన శ్రీదేవి అనే మహిళ 2014లో వ్యాపారం కోసం రూ.25 లక్షలు అప్పుగా తీసుకుంది. తిరిగి చెల్లించడానికి రూ.25 లక్షలకు చెక్ అందించింది. అయితే బ్యాంకులో సరిపడా నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. బాధితుడు వెంటనే కోర్టును ఆశ్రయించాడు. విచారించిన కోర్టు ఈ మేరకు నిందితురాలికి జైలు శిక్ష విధించింది. అలాగే నెలలోపు రూ.25లక్షలను కూడా బాధితుడికి చెల్లించాలని న్యాయమూర్తి షేక్ బాబాజాన్ తీర్పునిచ్చారు.

పని ఒత్తిడిపై బీఎల్‌ఓల నిరసన


ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఎల్‌ఓలు

నగరి : సచివాలయ ఉద్యోగులతో బీఎల్‌ఓల పని చేయిస్తూ తీవ్రంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని, సోమవారం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట బీఎల్‌ఓలు నిరసనకు దిగారు. సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ట్రెజరర్ టి. తిరుమలయ్య, జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ తమకు తహసీల్దార్ కార్యాలయంలోని ఆపరేటర్‌కు అందించే సదుపాయం కల్పించాలన్నారు. క్లెయిమ్స్ సమస్య పరిష్కరించాలని కోరారు. బీఎల్‌ఓల బాధ్యతల నుంచి తప్పించి, ఇందుకోసం ఇతర శాఖల ఉద్యోగులను వాడుకోవాలని సూచించారు. జిల్లా సీపీఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను బీఎల్వో విధుల పేరిట వేధించడం తగదన్నారు. నాలుగేళ్లపాటు బీఎల్వోలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనపై సమాచారం అందుకున్న సీఐ మహేశ్వర్ అక్కడకు చేరుకుని చర్చించారు. అనంతరం తమ డిమాండ్లతో సచివాలయ ఉద్యోగులు వినతి పత్రాన్ని ఆర్డీఓ వెంకటరెడ్డికి అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లె విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుత్తూరు: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ నెట్ బాల్, హ్యాండ్ బాల్ పోటీలకు పుత్తూరు మండలం గొల్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. సోమవారం ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ నెట్ బాల్ పోటీలకు సంబంధించి బాలుర విభాగంలో ఎ.మునిమోహిత్, కె.చరణ్ తేజ, పి.ధనుష్, బాలికల విభాగంలో ఎ.చంద్రకళ, పి.జాహ్నవి, ఇ.సంధ్య, ఎ.శృతి ఎంపికైనట్లు వివరించారు. అలాగే హ్యాండ్‌బాల్ బాలికల పోటీల్లో పి.హేమనందిని అర్హత సాధించినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో పీడీ గోపీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజల వినతులకు ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతులను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువు లోపు సమస్యలను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు. పలుశాఖలకు సంబంధించి మొత్తం 237 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించం


సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తే లేదని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో డీఎస్పీ సాయినాథ్‌తోకలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 45 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

ఇంటి నిర్మాణం కోసం..



ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతున్నారని, న్యాయం చేయాలని వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన బాధితురాలు అమ్ము ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. సొంతింటి కోసం గత ప్రభుత్వం ఒకటిన్నర సెంటు భూమిని ఇచ్చిందని, ఇల్లు కట్టుకుందామనుకుంటే ఆ స్థలం ఆక్రమణకు గురైందని పేర్కొంది.

భూ ఆక్రమణపై..



సదుం మండలం బురగమంద పంచాయతీ గాదేవారిపల్లి ఎస్టీ కాలనీ వాసులు భూ ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ కాలనీకి చెందిన నరసింహులు, నరేంద్ర మాట్లాడుతూ తమ కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 515 లో దాదాపు 8 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అందులో తమ గ్రామానికి చెందిన గిరిజనులు పశువులు, గొర్రెలు, మేకలు మేపుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. ఆ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నట్లు పేర్కొన్నారు.